క్లుప్తంగా

నందిపాటి ఇందిరకు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



ఇందిరను సన్మానిస్తున్న మంత్రి సీతక్క

హుజూర్‌నగర్ : పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు నందిపాటి ఇందిర రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందారు. సావిత్రీబాయి పూలే జయంతిని పురస్కరించుకుని ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి సీతక్క చేతుల మీదుగా ఆమె ఈ అవార్డును అందుకున్నారు. దీంతో సోమవారం ఆమెను పలువురు ఉపాధ్యాయులు, సంఘాల నాయకులు అభినందించారు.

20న సహకార సంఘం పాలకవర్గ సమావేశం

నడిగూడెం : మండల కేంద్రంలోని సహకార సంఘం చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం చేసి పలువురు డైరెక్టర్లు గత నెల 27న డీసీసీ నామా శ్రీధర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ నెల 20న పాలకవర్గం సమావేశం నిర్వహించాలని డైరెక్టర్లకు డీసీసీ సోమవారం నోటీసులు జారీ చేశారు.

వేణుగోపాలస్వామికి వెన్నతో అలంకరణ



హుజూర్‌నగర్ : పట్టణంలోని శ్రీవేణుగోపాల, సీతారామచంద్ర స్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా సోమవారం వేణుగోపాలస్వామికి వెన్నతో అలంకారం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని మూలవరులకు ఆవు వెన్న, తులసి, ద్రాక్ష, తదితర సుగంధ ద్రవ్యాలతో అలంకరించారు. రేపటి శోభాయాత్ర ఏర్పాట్లను ఈవో గుజ్జుల కొండారెడ్డి పర్యవేక్షించారు. అర్చకులు, స్థానాచార్యులు, ఆలయ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మేడారం సర్పంచ్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు

నేరేడుచర్ల : మండలంలోని మేడారం గ్రామ సర్పంచ్ సుంకరబోయిన స్వాతి గ్రామ పంచాయతీకి చెందిన వాటర్ ప్లాంట్ వస్తువులను అమ్ముకున్నారంటూ ఆరోపిస్తూ సోమవారం గ్రీవెన్స్‌డే సందర్భంగా జిల్లా కలెక్టర్ వెంకట్రావ్‌కు గ్రామ పంచాయతీ పాలక వర్గ సభ్యులు చేశారు. వాటర్ ప్లాంట్ స్టీల్ డ్రమ్, ఐరన్ ప్యూరిఫైడ్ సిలిండర్లు, మూడు మోటార్లు అమ్ముకున్నారని, ఆమెపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో గ్రామ ఉప సర్పంచ్ కమల, వార్డు సభ్యులు వెంకటేశ్వర్లు, సరిత, రమేష్, జానకిరాములు, సతీష్, కోటయ్య, నర్సయ్య, నాగయ్య, వెంకటేశ్వర్లు, సాయి తదితరులు ఉన్నారు.

వైభవంగా నాగేశ్వరిదేవి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం



నాగేశ్వరిదేవి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవంలో పురోహితులు, భక్తులు

గరిడేపల్లి : మండలంలోని పరెడ్డిగూడెం గ్రామంలో గణపతి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, నాగేశ్వరి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠను సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గొల్ల కురుమల నృత్యాలతో విగ్రహాల ఊరేగింపు, పురోహితులు కొంపెల్లి కృష్ణశాస్త్రి, వెంకటరమణ శాస్త్రి ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వీరంరెడ్డి లక్ష్మీశంబిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు వీరంరెడ్డి లక్ష్మి, శంబిరెడ్డి రామకృష్ణారెడ్డి, అంజిరెడ్డి, బోగాల నిరంజన్‌రెడ్డి, శ్రావణిరెడ్డి, వెంకట్‌రెడ్డి, జ్యోతి, భక్తులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న మాజీ జెడ్పీటీసీ ఉపేందర్

మునగాల : యువత విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కోల ఉపేందర్‌రావు కోరారు. మండలంలోని తాడువాయి గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని తాడువాయి యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు శరీర దారుఢ్యానికి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు భద్రంరాజు కృష్ణప్రసాద్, గ్రామపెద్దలు కొండమీది సాంగయ్య, కోట వెంకటేశ్వర్లు, కోట మన్మథుడు, నెమ్మాది రవి, జిల్లేపల్లి వంశీ, జిల్లేపల్లి శోభన్, కోట సైదాబాబు, మురళి, కోట అలీ, వెంకటేశ్, క్రీడల నిర్వాహకులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు పరిష్కరిస్తాం

- కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతి

కోదాడ : ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతిరెడ్డి హామీ ఇచ్చారు. సోమవారం కోదాడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వివిధ సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను ఆమె పరిశీలించారు. కోదాడ నుంచి రత్నవరం మీదుగా నాయకన్‌గూడెం వరకు ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలని, దీని దాదాపు 10 గ్రామాల ప్రజలకు మేలు కలుగుతుందని రత్నవరం గ్రామస్తులు ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ..

కోదాడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే పద్మావతి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కోదాడ పట్టణం, మండలానికి చెందిన 52 చెక్కులు, చిలుకూరు మండలానికి చెందిన 42 చెక్కులను, నడిగూడెం మండలానికి చెందిన 35 చెక్కులను ఆమె లబ్ధిదారులకు అందజేశారు.

ఎమ్మెల్యేకు ఆశా వర్కర్ల వినతి..

దీర్ఘకాలంగా తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం పలువురు ఆశా వర్కర్లు కోదాడ ఎమ్మెల్యేను క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల సమస్యలను పరిష్కరిస్తుందని, ఆశావర్కర్ల సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఆమె వారికి హామీ ఇచ్చారు. అనంతరం ఆశా వర్కర్లు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు.

మాజీ ఎమ్మెల్యే వర్ధంతికి ఆహ్వానం..

చిలుకూరులో నెల 19న నిర్వహించబోయే మాజీ ఎమ్మెల్యే దొడ్డా నర్సయ్య వర్ధంతి కార్యక్రమానికి రావాలని సీపీఎం సీనియర్ నాయకుడు దొడ్డా నారాయణరావు సోమవారం కోదాడ ఎమ్మెల్యే పద్మావతిని క్యాంపు కార్యాలయంలో కలిసి కోరారు.

సమస్యలు ఏకరువు

అనంతగిరి : మండల సమస్యలు పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని ఎమ్మెల్యే నలమాద పద్మావతిరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు సర్పంచ్‌లు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఎంపీపీ చుండూరు వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ కొణతం ఉమాశ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీ ధారావత్ రామ మాట్లాడుతూ.. మండల పరిషత్ కార్యాలయానికి పక్కా భవనం నిర్మించేందుకు నిధులు మంజూరు చేయించాలని ఎమ్మెల్యేను కోరారు. మండల వ్యాప్తంగా లింక్ రోడ్లను అభివృద్ధి చేయాలని కోరారు. మండలంలోని ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి గురుకుల బాలికల వసతి గృహాన్ని నిర్మించాలన్నారు. ప్రభుత్వ అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఉత్తమ్‌పద్మావతిరెడ్డి ఎత్తిపోతల పథకంలోని యంత్రాలు పూర్తిగా పాడైపోయాయని, మరమ్మతులకు నిధులు విడుదల చేయాలని కోరారు. సమావేశం దృష్టికి వచ్చిన సమస్యలపై నివేదికలు తయారుచేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ముందుగా పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ పరిమి విజయ, ఎంపీఓ తుమ్మల నాగేశ్వరరావు, ఎంఈఓ సలీం షరీఫ్, పీఆర్ఏఈ హర్ష, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



కోదాడ : బస్సు పునరుద్ధరించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న రత్నవరం గ్రామస్తులు

ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయం : ఎమ్మెల్యే

కోదాడరూరల్ : జయవరపు పరమేశ్వరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత నాలుగు సంవత్సరాలుగా ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని శ్రీమన్నారాయణ కాలనీలో పరమేశ్వరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలను ఆమె ప్రారంభించి అనంతరం విజేతలకు బహుమతులు అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు జయవరపు నరేందర్, కౌన్సిలర్ కట్టెబోయిన జ్యోతి శ్రీనివాస్, పాండురంగారావు, సులోచన, ఏర్నేని కుసుమ, జానకి, కృష్ణారావు తదితరులు ఉన్నారు.

కోర్టు భవన నిర్మాణానికి కృషిచేస్తా

కోదాడఅర్బన్ : కోదాడ కోర్టు నూతన భవన నిర్మాణానికి, న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే నలమాద పద్మావతిరెడ్డి అన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆమెను సోమవారం కోదాడలోని ఓ ఫంక్షన్ హాల్‌లో కోదాడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సత్కరించారు. అంతకుముందు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దేవబత్తిన నాగార్జున, కార్యదర్శి సాదు శరత్‌బాబు కోదాడ కోర్టులో నెలకొన్న ప్రధాన సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఫిబ్రవరి నెలలో కోదాడలో రెండు జిల్లా కోర్టులతో పాటు ప్రస్తుతం ఉన్న రెండు కోర్టు భవనాలకు శంకుస్థాపన చేసి త్వరితగతిన పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు ఎస్ఆర్‌కెమూర్తి, చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, మేకల వెంకట్రావు, కొండల్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, కృష్ణయ్య, చిత్తలూరి సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్‌నాయుడు, సీతారామరాజు, పాషా, పవన్ కుమార్, కరీం, గట్ల నర్సింహారావు, మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.



కోదాడఅర్బన్ : క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి

క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి

కోదాడఅర్బన్ : క్రీడలు యువతలో స్నేహభావాన్ని పెంపొందిస్తాయని ఎమ్మెల్యే నలమాద పద్మావతిరెడ్డి అన్నారు. పట్టణంలోని రాజీవ్ స్టేడియంలో కత్రం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కోదాడ నియోజకవర్గ స్థాయి కత్రం ప్రీమియర్ లీగ్ – 2 పోటీలను సోమవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో కోదాడ మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, మాజీ సర్పంచ్ పారా సీతయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈదుల కృష్ణయ్య, సామినేని ప్రమీల, నిరంజన్‌రెడ్డి, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

రామారావు జీవితం ఆదర్శనీయం

మునగాల : తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు, సీపీఎం పార్టీ నాయకుడు, కొక్కిరేణి గ్రామ మాజీ సర్పంచ్ బహుదొడ్డి రామారావు జీవితం ఆదర్శనీయమని, ఆయన ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మేదరమెట్ల వెంకటేశ్వరరావు కోరారు.. సోమవారం మండలంలోని కొక్కిరేణిలో బహుదొడ్డి రామారావు 20వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వర్ధంతి సభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తొలుత ఆయన స్మారకస్థూపం వద్ద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ములకలపల్లి రాములు, జిల్లా కమిటీ సభ్యుడు దేవరం వెంకటరెడ్డి, మండల కార్యదర్శి చందా చంద్రయ్య, సీపీఎం పట్టణ కార్యదర్శి మిట్టగణుపుల ముత్యాలు, సీపీఎం శాఖ కార్యదర్శి నందిగామ సైదులు, వట్టెపు చినసైదులు, ములకపల్లి నాగరాజు, మామిడి గురుమూర్తి, రావులపెంట వెంకన్న, ములకలపల్లి సైదులు, ఉపసర్పంచ్ బ్రహ్మం, హుస్సేన్, సైదులు పాల్గొన్నారు.



రామారావు వర్ధంతి సభలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

శోభాయాత్రలో పాల్గొనాలని మంత్రి ఉత్తమ్‌కు ఆహ్వానం



మంత్రి ఉత్తమ్‌కు ఆహ్వానం అందజేస్తున్న ఈఓ, అర్చకులు

హుజూర్‌నగర్ : పట్టణంలోని శ్రీవేణుగోపాల సీతారామచంద్రస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా మంగళవారం నిర్వహించబోయే స్వామివారి శోభాయాత్రలో పాల్గొనాలని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని ఆలయ ఈఓ కొండారెడ్డి కోరారు. ఈమేరకు ఆదివారం హైదరాబాద్‌లో ఉత్తమ్‌ను కలిసి ఆహ్వానం అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు ధనుంజయశర్మ, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డు ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరణ

నడిగూడెం : మండల కేంద్రంలోని ఎస్‌బీఐ బ్రాంచిలో సోమవారం ఆ బ్రాంచి మేనేజర్ సుబ్రహ్మణ్యం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల నూతన సంవత్సర క్యాలెండర్‌లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల గౌరవ అధ్యక్షుడు బందారు నాగేశ్వరరావు, మండల అధ్యక్షుడు ఎండి.ఖలీల్, కార్యదర్శి దున్నా అంజయ్య, కోశాధికారి ఎండి.ఇబ్రహీం, అసోసియేట్ అధ్యక్షుడు ఎ.అప్పారెడ్డి, ఉపాధ్యక్షుడు టి.వెంకటేశ్వరరావు, నాయకులు వెంకటరెడ్డి, హరీష్, అనురాగ్ పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎస్‌బీఐ మేనేజర్ సుబ్రహ్మణ్యం, తదితరులు

ముమ్మరంగా దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ

చిలుకూరు : ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ఎంట్రీ ప్రక్రియ ముమ్మరంగా జరుగుతుందని తహసీల్దార్ సరిత, ఎంపీడీఓ ఈదయ్య అన్నారు. సోమవారం చిలుకూరు మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ఎంట్రీ ప్రక్రియను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ప్రజాపాలన దరఖాస్తులు 11,795, రేషన్‌కార్డుల కోసం 2816 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఇప్పటివరకు 4 వేలకు పైగా దరఖాస్తులు ఆన్‌లైన్ అయినట్లు చెప్పారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ లక్ష్మారెడ్డి, మండల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పీఠాధిపతికి ఘన స్వాగతం



పీఠాధిపతి శివస్వామిని సన్మానిస్తున్న సత్యనారాయణ దంపతులు

మునగాల : అయోధ్య రామమందిర నిర్మాణ కమిటీ సభ్యుడు, శ్రీకోటిలింగ మహాశైవ క్షేత్ర తాళ్లాయిపాలెం పీఠాధిపతులు శ్రీశివస్వామికి సోమవారం మండలంలోని ముకుందాపురం గ్రామ శివారులో గల ఇందిర అనాథ వృద్ధాశ్రమంలో ఆశ్రమ నిర్వాహకురాలు నాగిరెడ్డి విజయమ్మ దంపదులు పీఠాధిపతి బృందానికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం సామాజిక ఉద్యమకారుడు డా.వేమూరి సత్యనారాయణ దంపదుతు పీఠాధిపతిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మహాశివ క్షేత్రం అన్నసంతర్పణ కమిటీ అధ్యక్షుడు చెరుకుమల్లి వెంకటనర్సయ్య, ప్రధాన కార్యదర్శి ఇడుకుళ్ల చెన్నకేశవరావు, ధర్మోరక్షితి,రక్షతః తెలంగాణ శాఖ అధ్యక్షుడు ఎడాలి శ్రీనివాసరావు, నరేష్, ఆశ్రమ కోఆర్డినేటర్ వాచేపల్లి జ్యోతి, అరుణ, గ్రామపెద్దలు పందిరి నాగిరెడ్డి, వివిధ గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

- కోదాడ డీఎస్పీ ప్రకాష్

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని కోదాడ డీఎస్పీ ప్రకాష్ అన్నారు. చింతలపాలెంలో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండు రాష్ట్రాల క్రికెట్ పోటీలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు వ్యక్తుల మధ్యనే కాకుండా ప్రాంతాల మధ్య కూడా మంచి సంబంధాలు మెరుగు పడేందుకు దోహద పడతాయని చెప్పారు. యువకులు అన్ని రకాల క్రీడల్లో పాల్గొని మంచి పేరు సంపాదించాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ సైదిరెడ్డి, నిర్వాహకులు, వివిధ పార్టీల నాయకులు, క్రీడాకారులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



తెలుగు రాష్ట్రాల స్థాయి క్రికెట్ క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న డీఎస్పీ ప్రకాష్

కస్తూరి ఫౌండేషన్ సేవలు అభినందనీయం

నేరేడుచర్ల : విద్యార్థులకు కస్తూరి ఫౌండేషన్ చేస్తున్న సేవలు అభినందనీయమని మండల విద్యాధికారి పానుగోతు చత్రునాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంతో పాటు మండలంలోని దిర్శించర్ల, పెంచికల్‌దిన్న, మేడారం, దాసారం, సోమారం, చింతకుంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 10 వతరగతి విద్యార్థులకు కస్తూరి ఫౌండేషన్ పంపిన స్టడీ మెటీరియల్‌ను అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బట్టు మధు, ఎల్. శ్రీనివాస్‌రావు, సత్యనారాయణరెడ్డి, ఫౌండేషన్ సభ్యులు గుడిపాటి కోటయ్య, పీడమర్తి వీరబాబు, మహేష్, నవీన్‌రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, కొండయ్య, ఉమాపతిరెడ్డి, గోపయ్య, పద్మావతి, సైదులు, నర్సింహారావు, మాధవి, శ్రవంతి, కళ్యాణి, రవికుమార్ తదితరులు ఉన్నారు.

గరిడేపల్లి : మండల కేంద్రంతో పాటు కల్మలచెరువు, గడ్డిపల్లి, కీతవారిగూడెం, వెలిదండ, గానుగబండ, రాయినిగూడెం, పానుగోడు గ్రామాల్లోని కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో పదో తరగతి విద్యనభ్యసిస్తున్న 300 మంది విద్యార్థులకు కస్తూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎంఈఓ చత్రునాయక్ స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు గుడిపాటి కోటయ్య, పిడమర్తి వీరబాబు, ఎలకపల్లి మహేష్, నవీన్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు సువర్ణ, శ్రీనివాసరావు, రవీందర్‌రెడ్డి, రఫీ, రామ్‌రెడ్డి, సీతారాం, ధర్మేశ్, ఖాజా, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



నేరేడుచర్లలో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఎంఈఓ చత్రునాయక్

గడపగడపకు అయోధ్య అక్షింతలు

కోదాడఅర్బన్ : అయోధ్యలో ఈ నెల 22న శ్రీరాముడి ప్రతిష్ఠ సందర్భంగా అక్కడి నుంచి వచ్చిన అక్షింతలను సోమవారం రామభక్తులు కోదాడలోని శ్రీగుంటి రఘునాథస్వామి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం పట్టణంలోని నయానగర్‌లో అక్షింతలను గడపగడపకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గుడుగుంట్ల రంగయ్య, దండాల సీతారాంరెడ్డి, డాక్టర్ రంగాచార్యులు, కౌన్సిలర్ కె.చందర్‌రావు, బొలిశెట్టి కృష్ణయ్య, నూనె సులోచన, కె.వాసవి, దేవి, పుష్పావతి, సుహాసిని, అన్నపూర్ణ, పాపారాణి, వాణి, ఝాన్సీ, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

లక్కవరంలో..

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని లక్కవరంలో అయోధ్య శ్రీసీతారామచంద్రస్వామి అక్షింతలను సోమవారం ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చామకూరి గురుపాథం, మధు, కోటిరెడ్డి, నరసింహారెడ్డి, సైదులు, శ్రీను, రామచంద్రయ్య, ఉపేందర్‌రెడ్డి, చందర్‌రావు, నరసింహారావు, ఆనంద్, రామకృష్ణ, రాము, మల్లయ్య, గురువయ్య, సతీష్, శివ, పాండు, సాయిలు తదితరులు ఉన్నారు.



కోదాడఅర్బన్ : పంపిణీ చేసేందుకు అక్షింతల కలశాలను తీసుకెళ్తున్న రామ భక్తులు

యువ కవయిత్రి అర్చనాదేవికి గోల్డ్‌మెడల్



అర్చనాదేవికి గోల్డ్ మెడల్, ప్రశంసాపత్రం అందజేస్తున్న నిర్వాహకులు

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్‌కు చెందిన యువ కవయిత్రి శ్రీపాద అర్చనాదేవి ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రిలో గల ఆదికవి నన్నయ్య కళాశాల ఆవరణలో నిర్వహించిన అంతర్జాతీయ తెలుగు మహాసభలలో కవి సమ్మేళనంలో పాల్గొని ప్రశంసాపత్రం, గోల్డ్ మెడల్ అందుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం ఆమె మాట్లాడుతూ.. ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్, చైతన్య విద్యాసంస్థల వ్యవస్థాపకుడు చైతన్య రాజు సంయుక్త ఆధ్వర్యంలో రాజమండ్రిలో మూడు రోజులపాటు రెండో అంతర్జాతీయ తెలుగు మహాసభలు నిర్వహించారని తెలిపారు. ఇక్కడ కవి సమ్మేళనంలో పాల్గొని బంధం బాధ్యత కథ, అర చేతి వైకుంఠం కవితా పఠనం చేసినట్లు తెలిపారు. దీంతో నిర్వాహకులు ఆంధ్ర సారస్వత పరిషత్ జాతీయ సమన్వయకర్త డాక్టర్ ఎస్ ఆర్ ఎస్ కొల్లూరి, రాజేష్ డాక్టర్ కే టి పద్మ ప్రశంసా పత్రం, గోల్డ్ మెడల్‌తో సత్కరించినట్లు ఆమె తెలిపారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థికసాయం అందజేత



మునగాల : ఆర్థికసాయం అందజేస్తున్న మిత్రులు

మునగాల : మండల కేంద్రానికి చెందిన కైరోజు సత్యనారాయణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మృతిచెందారు. దీంతో సోమవారం సత్యనారాయణ చిన్ననాటి స్నేహితులు (1990- 95 ప్రైమరీ స్కూల్ బ్యాచ్) రూ.పదివేల ఆర్థికసాయాన్ని మృతుడి కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో చిన్ననాటి మిత్రులు పాల్గొన్నారు.

బిల్లులు సకాలంలో చెల్లించాలి

గరిడేపల్లి : మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లులను సకాలంలో చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి రణబోతు రవీందర్ అన్నారు. సోమవారం మండలంలోని వెలిదండ పాఠశాలలో వంట కార్మికుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మధ్యాహ్న భోజన కార్మికులకు బిల్లులు అందక అప్పుల పాలవుతున్నారని అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడం ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్ బిల్లులు మంజూరు చేసి ఇప్పటి నుండి ఎప్పటికప్పుడు బిల్లులు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

11 కేవీ విద్యుత్ లైన్ తొలగించాలని వినతి

నడిగూడెం : మండలంలోని కాగితరామచంద్రాపురం, రత్నవరం గ్రామాల్లో పలువురి ఇళ్లపై 11 కేవీ విద్యుత్ లైన్ ప్రమాదకరంగా ఉందని, ఆలైన్‌ను వెంటనే తొలగించాలని కోరుతూ సోమవారం టీడీపీ ఆధ్వర్యంలో నడిగూడెం విద్యుత్ శాఖ ఏఈ ఎస్‌కె.సైదాకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గుండు నాగేశ్వరరావు, చక్రాల పిచ్చయ్య, షేక్.జహీర్‌అలీ, సైదులు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశం నేటికి వాయిదా

కోదాడరూరల్ : కోదాడ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నేటికి వాయిదా పడింది. సోమవారం జరగాల్సిన సర్వసభ్య సమావేశానికి పాలకవర్గంలో ప్రస్తుతం 9 మంది ఎంపీటీసీలు ఉండగా కూచిపూడి ఎంపీటీసీ శంకరశెట్టి కోటేశ్వరరావు ఒక్కరే హాజరయ్యారు. సమావేశానికి సరిపడా కోరం లేకపోవడంతో తిరిగి సమావేశాన్ని మంగళవారానికి వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీఓ విజయశ్రీ తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

పెండింగ్ చలానాలు చెల్లించాలి

కోదాడరూరల్ : వాహనదారులు తమ పెండింగ్ చలానాలను చెల్లించి ప్రభుత్వం ప్రకటించిన రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని పట్టణ సీఐ రాము అన్నారు. సోమవారం పట్టణంలోని రంగా థియేటర్ చౌరస్తాలో వాహనాలపై ఉన్న చాలానాల రాయితీలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ట్రాఫిక్ ఎస్ఐ రాంబాబు, సిబ్బంది ఉన్నారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు గడువు పెంపు

నడిగూడెం : ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు ఈ నెల 11 వరకు గడువు పెంచినట్లు నడిగూడెం అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ మైనం శోభన్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు 9948167007 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఎంపీపీ రాజీనామాపై సంబరాలు

కోదాడరూరల్ : ఎంపీపీగా చింత కవితారాధారెడ్డి తన పదవికి రాజీనామా చేయడంతో మండలంలోని గుడిబండకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం రాత్రి బాణసంచా కాల్చి సంబరాలు నిర్వహించుకున్నారు. ఆమె స్థానికంగా ఉంటూ గ్రామంలో అనేక మంది అమాయకులపై అక్రమంగా కేసులు పెట్టించి ఇబ్బందులకు గురిచేసిందని ఆవేదన వ్యక్తం చేశారు.

కోటయ్య మృతి కాంగ్రెస్‌కు తీరని లోటు

మఠంపల్లి : మండలంలోని వరదాపురంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బచ్చలకూరి మట్టయ్య (74) సోమవారం అనారోగ్యంతో మృతిచెందారు. కోటయ్యకు ప్రస్తుత గ్రామ సర్పంచ్ బచ్చలకూరి అఖిల మనవరాలు కాగా, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బచ్చలకూరి బాబు కుమారుడు అవుతారు. కాగా కోటయ్య మృతదేహాన్ని నాయకులు, ప్రజాప్రతినిధులు సందర్శించి నివాళులర్పించారు. ఆయన మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని అన్నారు. మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కోటయ్య కుటుంబసభ్యులకు సంతాపం వ్యక్తం చేశారు. నాయకులు శివారెడ్డి, మంజీనాయక్, బచ్చలకూరి బాబు, విశ్వనాథుల శ్రీనివాస్, దుర్గయ్య, లింగయ్య, నాగుల్‌మీరా, అచ్చయ్య పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

కోదాడఅర్బన్ : యువత సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అనంతగిరి ఎస్ఐ అనిల్‌రెడ్డి అన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సోమవారం కోదాడ పోలీసులు వివిధ రకాల సైబర్ నేరాలపై పట్టణంలోని సనా ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ నాగప్రసాద్, పోలీస్ సిబ్బంది ఆజయ్‌కుమార్, కుంభం శ్రీను, ప్రతాప్‌రెడ్డి, రవీంద్రనాథ్, కళాబృందం ఇన్‌చార్జ్ యల్లయ్య పాల్గొన్నారు.

నేడు దివ్యాంగులకు ఉచిత బస్‌పాస్ మేళా

మిర్యాలగూడ టౌన్ : నేరేడుచర్ల మున్సిపాలిటీ కార్యాలయంలో ఈనెల 9న దివ్యాంగులకు ఉచిత బస్‌పాస్ మేళా నిర్వహించనున్నట్లు మిర్యాలగూడ ఆర్టీసీ డీఎం బొల్లెద్దు పాల్ సోమవారం తెలిపారు. మిర్యాలగూడ డిపో పరిధిలోని నేరేడుచర్ల, గరిడేపల్లి, పాలకీడు మండలాల దివ్యాంగులు ఉదయం 9గంటలకు రావాలన్నారు. మహిళలు కూడా బస్సు పాస్‌ల ను తీసుకొని డీలక్స్ బస్సుల్లో ప్రయాణించవచ్చన్నారు.

గడ్డివాములు దగ్ధం

కోదాడరూరల్: పట్టణ పరిధిలోని తమ్మరలో సోమవారం గడ్డివాములు దగ్ధమయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు..గ్రామానికి చెందిన సుల్తాన్ వెంకన్న, పాలకుర్తి వెంకన్న 420 గడ్డిమోపులతో వేర్వేరుగా గడ్డివాములు వేసుకున్నారు. ప్రమాదవశాత్తు నిప్పంటుకొని గడ్డివాములు దగ్ధమవుతుండగా.. స్థానికులు ఫైరింజన్‌కు ఫోన్ చేశారు. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలు ఆర్పేలోగా గడ్డి మొత్తం దగ్ధమైటనట్లు బాధిత రైతులు తెలిపారు.